సాక్షి
కర్నూలు
బుధవారం। 8। అక్టోబర్। 2025



పంట కోతకు ముందే కన్నీరు

ఉల్లి రైతులు కూటమి ప్రభుత్వ తీరుతో కన్నీళ్లు పెట్టుకుంటున్నారు. గిట్టుబాటు ధర లేక పొలాల్లోనే దిగుబడిని వదిలేస్తున్నారు. బరువెక్కిన గుండెలతో పంటను దున్నేస్తున్నారు. 8లో▸



వచ్చేనెల 12న ఆర్‌యూ కాన్వొకేషన్

రాయలసీమ యూనివర్సిటీ (ఆర్‌యూ) 4వ కాన్వొకేషన్ నవంబర్ 12న వర్సిటీలో నిర్వహిస్తున్నట్టు వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ వి.వెంకటబసరావు మంగళవారం తెలిపారు. 8లో▸



శనగల బసవన్నకు పూజలు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల మహాక్షేత్రంలోని స్వామి అమ్మవార్ల ఆలయ ప్రాంగణంలోని శనగల బసవన్నకు, బయలు వీరభద్ర స్వామికి మంగళవారం విశేష పూజలు నిర్వహించారు.

న్యూస్‌రీల్

మతోన్మాదులను కట్టడిచేయకపోతే ప్రజాస్వామ్యానికే ప్రమాదం



కోర్టులో నిరసన వ్యక్తం చేస్తున్న న్యాయవాదులు

కర్నూలు(సెంట్రల్): మతోన్మాదులను కట్టడి చేయకపోతే ప్రజాస్వామ్యానికే ప్రమాదమని బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు హరినాథ్‌చౌదరి, వెంకటేశ్వర్లు అన్నారు. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్‌పై దాడిని న్యాయవాదులు, ప్రజా సంఘాలు ఖండించాయి. ఆయనకు మద్దతుగా మంగళవారం జిల్లా వ్యాప్తంగా ఆందోళనలు, రాస్తారోకోలు, నిరసన కార్యక్రమాలను చేపట్టారు. జిల్లా కోర్టులో న్యాయవాదులు విధులను బహిష్కరించారు. నేషనల్ లాయర్స్ ఫోరం ఫర్ సోషల్ జస్టిస్ ఆధ్వర్యంలో న్యాయవాదులు విధులు బహిష్కరించి ఆందోళన చేపట్టారు. న్యాయవాది ఉద్దేశపూర్వకంగా కోర్టులో మత నినాదాలు చేస్తూ దాడికి పాల్పడడం మంచి పద్ధతి కాదని సీనియర్ న్యాయవాది జయరాజు అన్నారు. ఆయనన్ను న్యాయవాద వృత్తి నుంచి తొలగించాలని కోరారు. తనపై దాడి జరిగినా కోర్టును కొనసాగించిన ప్రధాన న్యాయమూర్తి బీఆర్ గవాయ్ అత్యున్నత పదవికి ఇచ్చిన గౌరవమని, ఆయన సేవలు ఎనలేనివని కొనియాడారు.

తల్లిదండ్రులను విస్మరిస్తే ఆస్తిహక్కు కోల్పోతారు



మాట్లాడుతున్న జడ్జి బి.లీలా వెంకట శేషాద్రి

కర్నూలు(అర్బన్): వృద్ధ తల్లిదండ్రులకు పిల్లలు చేయూతనివ్వకపోతే ఆస్తి హక్కు కోల్పోతారని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.లీలా వెంకట శేషాద్రి అన్నారు. మంగళవారం జిల్లా హార్టికల్చర్ మీటింగ్ హాలులో ఏర్పాటు చేసిన ప్రపంచ వృద్ధుల దినోత్సవ వారోత్సవాలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆర్థికంగా ఒకస్థాయిలో ఉన్న వృద్ధులు కూడా కుటుంబ సభ్యుల నిర్లక్ష్యం.. ఆస్తుల కోసం వేధింపులు, దాడులను ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అయితే వృద్ధులను ఆదుకోవడానికి అనేక చట్టాలు, సంక్షేమ పథకాలు ఉన్నాయన్నారు. తల్లిదండ్రులు, వయోవృద్ధుల పోషణ చట్టం(2007) ప్రకారం వృద్ధులకు నెలవారీ జీవన భృతి కల్పించాలన్నారు.వారి పోషణను విస్మరించిన వారికిజరిమానా, జైలు శిక్ష తప్పవన్నారు. వృద్ధులకు ఏమైనా సమస్యలుంటే 15100 కాల్ చేస్తే ఉచిత న్యాయ సహాయాన్ని అందించేందుకు చర్యలు చేపడతామన్నారు. అనంతరం వృద్ధులకు సంక్షేమశాఖ నుంచి వచ్చిన బెడ్‌షీట్లను అందించారు. కార్యక్రమంలో గవర్నమెంట్ ఆసుపత్రి సూపరింటెండెంట్ వెంకటేశ్వర్లు, జిల్లా కోఆర్డినేటర్ హాస్పిటల్ సర్వీసెస్ జఫ్రుల్లా తదితరులు పాల్గొన్నారు.

రానున్న ఐదు రోజులు వర్ష సూచన

కర్నూలు(అగ్రికల్చర్): రానున్న ఐదు రోజుల్లో ఉమ్మడి జిల్లాలో తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాస్త్రవేత్తలు ప్రకటించారు. జిల్లా మొత్తంగా సగటున ఈ నెల 8న 4 మి.మీ, 9న 12, 10న 15, 11న 13, 12న 15 మి.మీ ప్రకారం వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉన్నట్లుగా మంగళవారం తెలిపారు. ఉష్ణోగ్రతలు 31.8 డిగ్రీల నుంచి 32.6 డిగ్రీల వరకు నమోదయ్యే అవకాశం ఉందన్నారు. నంద్యాల జిల్లాలో ఉష్ణోగ్రతలు కాస్త ఎక్కువగా ఉండే అవకాశం ఉందని.. ఈశాన్యం దిశగా గాలులు గంటకు 9–10 కిలో మీటర్ల వేగంతో వీచే అవకాశం ఉన్నట్లు పేర్కొన్నారు.

పీహెచ్‌సీల వైపు చూడని వైద్యులు

కర్నూలు(హాస్పిటల్): దీర్ఘకాలిక సమస్యల పరిష్కారం కోసం ఓ వైపు మెడికల్ ఆఫీసర్లు విధులు బహిష్కరించి వారం రోజులుగా సమ్మె చేస్తుండగా వారి స్థానంలో సర్దుబాటు చేసిన వైద్యులు అటువైపు కన్నెత్తి చూడటం లేదు. దీంతో వివిధ వ్యాధులతో చికిత్స కోసం ఆసుపత్రులకు వచ్చిన రోగులు వైద్యులు లేరని తెలిసి నిరాశగా వెనుదిరుగుతున్నారు. సోమవారం మొత్తం 35 మందిలో 15 మంది మాత్రమే విధులకు హాజరు కాగా, మంగళవారం కేవలం ఇద్దరు రెగ్యులర్ వారితో పాటు 9 మంది మాత్రమే విధులకు హాజరయ్యారు. ఇందులో ఉలిందకొండ, కోసిగి, గజ్జిహళ్లి, గార్గేయపురం, కొతాళం, కల్లూరు, హాలహర్వి–ఎ, గూడూరు, పగిడిరాయి, పెద్దకడుబూరు, పెద్దహరివాణం పీహెచ్‌సీలు ఉన్నాయి. వైద్యులు లేకపోవడంతో రోగులకు అక్కడున్న ఫార్మాసిస్టులు, నర్సులు వ్యాధి లక్షణాల మేరకు మందులు ఇచ్చి పంపిస్తున్నారు. మరోవైపు సంచార చికిత్స వాహనాలు సైతం వారం రోజులకు పైగా కదలడం లేదు. దీంతో దీర్ఘకాలిక జబ్బులతో బాధపడుతున్న రోగులు వైద్యపరీక్షలు, మందులు లేక ఇబ్బందులు పడుతున్నారు.

అధనం ఇస్తేనే ఆరోగ్యశ్రీ!

- నెట్‌వర్క్ ఆసుపత్రుల్లో అదనపు వసూళ్లు
- ప్యాకేజీ సరిపోదని చెబుతున్న వైనం
- మెడికల్ కేసుల నిరాకరణ
- బిల్లులు ఇవ్వని రాష్ట్ర ప్రభుత్వం
- జిల్లా వ్యాప్తంగా రూ.150 కోట్ల దాకా బకాయిలు



కర్నూలు(హాస్పిటల్): ఎన్‌టీఆర్ వైద్యసేవ పథకం(ఆరోగ్యశ్రీ) కింద కర్నూలు జిల్లాలో 60 ప్రైవేటు ఆసుపత్రులు, రెండు బోధనాసుపత్రులు, రెండు ఏరియా ఆసుపత్రులు, ఒక ఎంసీహెచ్ ఆసుపత్రి, ఐదు సీహెచ్‌సీలు, 35 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలతో పాటు డెంటల్ క్లినిక్‌లు 25 కలిపి మొత్తం 130 ఆసుపత్రులు రిజిస్టర్ అయ్యాయి. ప్రసవాలకు కూడా ఈ పథకం వర్తింపజేయడంతో ప్రైవేటు ఆసుపత్రులతో పాటు ప్రభుత్వ ఆసుపత్రుల్లోనూ వైద్యసేవ ద్వారా నిధులు వస్తున్నాయి. ఇలా వచ్చిన డబ్బుతో ప్రభుత్వ ఆసుపత్రులను బలోపేతం చేయడం కోసం గత ప్రభుత్వం దీనిని ప్రవేశపెట్టింది. ఈ మేరకు నిధులు కూడా విడుదల చేసింది. వైద్యసేవ అనుమతులు పొందిన వాటిలో చిన్న ఆసుపత్రుల నుంచి కార్పొరేట్ ఆసుపత్రుల వరకు ఉన్నాయి. అయితే గత ఏడాదిన్నర కాలంగా నెట్‌వర్క్ ఆసుపత్రులకు వైద్యసేవ కింద చికిత్స అందించినందుకు గాను ఇవ్వాల్సిన నిధులు విడుదల చేయడం లేదు. ఈ విషయమై ఆయా ఆసుపత్రులు పలుమార్లు ప్రభుత్వానికి విన్నవించినా స్పందించే నాథుడు కరువయ్యారు. గత యేడాది ఒకసారి సమ్మె చేస్తామంటే రూ.500కోట్లు మాత్రమే ఇచ్చారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు రాష్ట్ర వ్యాప్తంగా రూ.3వేల కోట్లకు పైగా బకాయిలు ఉండగా, కర్నూలు జిల్లాలోనే రూ.150కోట్ల దాకా ఆసుపత్రులకు బకాయిలు ఉన్నట్లు వైద్యులు చెబుతున్నారు.

- నంద్యాలకు చెందిన వెంకటేశ్వర్లు ఇటీవల భుజానికి ఆపరేషన్ చేయించుకుందామని కర్నూలులోని కొత్తబస్టాండ్ ప్రాంతంలో ఉన్న ఓ నెట్‌వర్క్ ఆసుపత్రికి వెళ్లారు. ఎన్‌టీఆర్ వైద్యసేవలో ప్యాకేజీ సరిపోదని, ఇన్‌ప్లాంట్స్ మంచివి కావాలంటే అదనంగా డబ్బులు ఇవ్వాలని రూ.30వేలు వసూలు చేశారు.
- కర్నూలు నగరంలోని బుధవారపేటకు చెందిన అనిల్‌కుమార్‌కు రోడ్డు ప్రమాదంలో గాయపడటంతో బుధవారపేటలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చేర్చారు. ఎన్‌టీఆర్ వైద్యసేవలో శస్త్రచికిత్స వర్తించినా అదనంగా అతని నుంచి ఆసుపత్రి వారు రూ.20వేలు వసూలు చేశారు.
- ఎమ్మిగనూరుకు చెందిన ఈరన్న మూడు నెలల క్రితం కడుపు నొప్పి రావడంతో స్థానిక ఆర్‌ఎంపీ సహాయంతో కర్నూలులోని నెట్‌వర్క్ ఆసుపత్రికి వెళ్లారు. అక్కడి వైద్యులు వారి సొంత స్కానింగ్ మిషన్‌లోనే పరీక్ష చేయించి అపెండిక్స్ ఉందని చెప్పి ఆరోగ్యశ్రీలో ఆపరేషన్ చేశారు. వాస్తవంగా అతనికి ఎలాంటి అపెండిక్స్ లేదని, ఆరో గ్యశ్రీ కోసం ఆసుపత్రి నిర్వాహకులు ఆపరేషన్ చేశారని కుటుంబసభ్యులు అప్పట్లో ఆరోపించారు.

.. వీరే కాదు ఎన్‌టీఆర్ వైద్య సేవ కార్డు జేబులో పెట్టుకుని ఏ నెట్‌వర్క్ ఆసుపత్రికి వెళ్లినా జేబులో కార్డుతో పాటు డబ్బులు కూడా తీసుకుంటున్నారు. వైద్యసేవ కింద చికిత్స ఉచితం కదా అని అడిగితే ప్రభుత్వం ఇచ్చే డబ్బులు ఏ మూలకూ సరిపోవని, ఆ'ధనం' ఇస్తే మంచి మందులు, వైద్యపరికరాలతో చికిత్స అందిస్తామని చెబుతున్నారు. దీంతో వారు అడిగిన మేరకు డబ్బులు ఇచ్చి చికిత్స చేయించుకుంటున్నారు. ఇలా ఇచ్చిన కొందరు మాత్రమే అధికారులకు ఫిర్యాదు చేస్తున్నారు. మిగిలిన వారు డాక్టర్లతో మళ్లీ పని పడుతుందని భావించి ఫిర్యాదు చేయకుండా వెళ్లిపోతున్నారు.

ఉచితం మాటున వసూళ్లు

ఆరోగ్యశ్రీ కార్డు జేబులో ఉంటే ఎంత పెద్ద కార్పొరేట్ ఆసుపత్రిలోనైనా ఉచితంగా చికిత్స తీసుకునే సౌలభ్యం గత ప్రభుత్వంలో ఉంది. కానీ ఇప్పుడు పరిస్థితులు మారాయి. ప్యాకేజీలు సరిపోవడం లేదని, ప్రభుత్వం నుంచి నిధులు రావడం లేదని చెబుతూ ప్రైవేటు ఆసుపత్రులు రోగుల నుంచి ఎన్‌టీఆర్ వైద్యసేవ చికిత్సకు డబ్బులు వసూలు చేస్తున్నాయి. శస్త్రచికిత్సలకు ప్రభుత్వం ఇచ్చే ప్యాకేజీ(నిధులు) ఏ మూలకూ సరిపోవని చెబుతున్నారు. 20 ఏళ్ల క్రితం నాటి ప్యాకేజీతో ఇప్పుడెలా వైద్యం చేస్తామని, ఆ డబ్బులతో చేసే వైద్యానికి తాము గ్యారంటీ ఇవ్వలేమంటున్నారు. ఇన్‌ఫెక్షన్ వస్తే తమ బాధ్యత కాదని రోగులను బెదిరించి రూ.20వేల నుంచి రూ.50వేల దాకా డబ్బులు వసూలు చేస్తున్నారు. ఈ విషయాన్ని ఎవ్వరికీ చెప్పకూడదని కూడా రోగులను పరోక్షంగా బెదిరిస్తున్నాయి. తరచూ అధికారులు సంబంధిత ఆసుపత్రులను తనిఖీ చేసి రోగులెవ్వరైనా ఫిర్యాదు చేస్తే సదరు ఆసుపత్రులపై చర్యలు తీసుకుంటున్నా వారి వైఖరిలో మార్పు రావడం లేదు.



ఎన్‌టీఆర్ వైద్యసేవ కియోస్క్

ఆపరేషన్లకు మాత్రమే చికిత్స

డెంగీ, పక్షవాతం, వైరల్ ఫీవర్లు, వాంతులు–విరేచనాలు, ఆస్తమా, ఆయాసం, సీవోపీడీ వంటి మెడికల్ కేసులకు నెట్‌వర్క్ ఆసుపత్రుల్లో చికిత్స లభించడం లేదు. ఇలాంటి మెడికల్ రోగులను రోజుల తరబడి చికిత్స అందించాల్సి ఉంటుందని, ప్రభుత్వం ఇచ్చే ప్యాకేజీ సరిపోదని భావించి ఎన్‌టీఆర్ వైద్యసేవలోనే వారు మెడికల్ జబ్బులకు ఎన్‌ప్యానల్ కావడం లేదు. కర్నూలు నగరంలోని కేవలం ఒకటి, రెండు ఆసుపత్రుల్లో మాత్రమే ఈ సౌకర్యం ఉంది. దాదాపుగా అన్ని ఆసుపత్రుల్లో కేవలం శస్త్రచికిత్సలు మాత్రమే చేస్తున్నారు. మెడికల్ జబ్బులు వస్తే సదరు రోగి ప్రైవేటు ఆసుపత్రుల్లో డబ్బులు ఖర్చు చేసి వైద్యం చేయించుకోవాలి, ఆర్థిక స్తోమత లేకపోతే ప్రభుత్వ ఆసుపత్రిలో చేరాల్సిన పరిస్థితి నెలకొంది.

వందలాదిగా ఫిర్యాదులు

ఎన్‌టీఆర్ వైద్యసేవ పథకం ద్వారా చికిత్స అందించే నెట్‌వర్క్ ఆసుపత్రుల్లో వైద్యం పొందిన రోగుల నుంచి ఐవీఆర్‌ఎస్ విధానం ద్వారా కూటమి ప్రభుత్వం నేరుగా ఫోన్ చేసి స్పందన(ఫీడ్‌బ్యాక్) తీసుకుంటోంది. ఇందులో ఆసుపత్రుల పనితీరు, చికిత్స అందించిన తీరు, డబ్బులు ఏమైనా అడిగారా వంటి వివరాలు సేకరిస్తున్నారు. దీంతో పాటు 104 ద్వారా కూడా ఫిర్యాదులు తీసుకుంటున్నారు. కొందరు ఎన్‌టీఆర్ వైద్యసేవ అధికారులకు నేరుగా ఫిర్యాదు చేస్తున్నారు. ఏడాదిన్నర కాలంలో 600లకు పైగా నెట్‌వర్క్ ఆసుపత్రులపై ఫిర్యాదులు వచ్చాయి. వీటిని జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో అధికారులు సమీక్షించి కొన్ని ఆసుపత్రులను హెచ్చరించడం, మరికొన్నింటికి జరిమానా విధించడం చేస్తున్నారు. వచ్చిన ఫిర్యాదుల్లో కొన్నింటిపై మాత్రమే చర్యలు తీసుకుంటున్నారన్న విమర్శలూ ఉన్నాయి.

ఈ ఏడాది ఎన్‌టీఆర్ వైద్యసేవ చికిత్స వివరాలు	
మాసం	శస్త్రచికిత్సలు
జనవరి	8,627
ఫిబ్రవరి	8,604
మార్చి	9,588
ఏప్రిల్	10,905
మే	11,814
జూన్	11,607
జూలై	10,826
ఆగస్టు	10,624

చర్యలు తీసుకుంటున్నాం




ఎన్‌టీఆర్ వైద్యసేవ(ఆరోగ్యశ్రీ) ద్వారా రోగులకు ఉచితంగా చికిత్సను అందించే నెట్‌వర్క్ ఆసుపత్రులు కొన్ని డబ్బులు వసూలు చేస్తున్నాయని ఐవీఆర్‌ఎస్, 104 ద్వారా కొందరు నేరుగా మా కార్యాలయానికి వచ్చి ఫిర్యాదు చేస్తున్నారు. ఈ మేరకు సంబంధిత ఆసుపత్రుల్లో విచారణ చేసి నిజమని తేలితే జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో చర్యలు తీసుకుంటున్నాం. ఈ యేడాది ఇప్పటి వరకు 150 దాకా ఫిర్యాదులు వచ్చాయి. ఈ మేరకు విచారణ చేసి నివేదికను గతంలో జిల్లా కలెక్టర్‌కు పంపించాం. త్వరలో వాటిపై చర్యలు తీసుకుంటాం.

–డాక్టర్ భాస్కరరెడ్డి, ఎన్‌టీఆర్ వైద్యసేవ జిల్లా కో ఆర్డినేటర్, కర్నూలు

వైఎస్సార్‌సీపీ టాక్స్-కర్నూలు యూట్యూబ్ చానల్ ప్రారంభం

సాక్షి, అమరావతి: వైఎస్సార్‌సీపీ టాక్స్- కర్నూలు యూట్యూబ్ చానల్‌ను వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మంగళవారం పార్టీ కేంద్ర కార్యాలయంలో ప్రారంభించారు. కూటమి ప్రభుత్వ వైఫల్యాలను సోషల్ మీడియా వేదికగా ఎప్పటికప్పుడు తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ స్టేట్ కో ఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి, కర్నూలు, నంద్యాల జిల్లాల పార్టీ అధ్యక్షులు ఎస్వీ మోహన్ రెడ్డి, కాట సాని రాంభూపాల్ రెడ్డి, కర్నూలు నగర మేయర్ బీవై రామయ్య, కర్నూలు జిల్లా పార్టీ ప్రధాన కార్యదర్శి హనుమంత రెడ్డి, పలువురు నాయకులు పాల్గొన్నారు.



యూట్యూబ్ చానల్‌ను ప్రారంభిస్తున్న వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, చిత్రంలో కర్నూలు, నంద్యాల జిల్లాల అధ్యక్షులు ఎస్వీ మోహన్‌రెడ్డి, కాటసాని రాంభూపాల్‌రెడ్డి, మేయర్ బీవై రామయ్య

వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చాలి

- ఆలూరు ఎమ్మెల్యే బుసినే విరూపాక్షి, ఎమ్మెల్సీ డాక్టర్ మధుసూదన్

ఆలూరు: వాల్మీకులను ఓటు బ్యాంక్‌గా చూడకుండా ఎస్టీ జాబితాలో చేర్చేందుకు సీఎం చంద్రబాబు నాయుడు కృషి చేయాల్సిన బాధ్యత ఉందని ఆలూరు ఎమ్మెల్యే బుసినే విరూపాక్షి, ఎమ్మెల్సీ డాక్టర్ మధుసూదన్ డిమాండ్ చేశారు. నియోజకవర్గ కేంద్రమైన ఆలూరులో మంగళవారం వాల్మీకి సంఘం నియోజకవర్గం నాయకుడు భాస్కర్ ఆధ్వర్యంలో వాల్మీకి మహర్షి జయంతిని ఘనంగా నిర్వహించారు. ముందుగా స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథి గృహం నుంచి పాత బస్టాండు సమీపంలో ఉన్న వాల్మీకి విగ్రహం వరకు రాజకీయ పార్టీలకు అతీతంగా వాల్మీకులు, సంఘ నాయకులు ర్యాలీగా తరలివచ్చారు. వాల్మీకి విగ్రహానికి ప్రత్యేక పూజలు చేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, తదితరులు మాట్లాడారు. ప్రధానంగా వాల్మీకి కులస్తులను ఎస్టీ జాబితాలోకి చేర్పించేందుకు కూటమి నేతలు ప్రధాన మంత్రి దృష్టికి తీసుకెళ్లాలన్నారు. వాల్మీకులు అన్ని రంగాల్లో రాణించాలన్నారు. కార్యక్రమంలో వాల్మీకి సంఘం జిల్లా అధ్యక్షుడు రామాంజినేయులు, నాయకులు శ్రీనివాసులు, ఎల్లప్ప, అరికెర వెంకటేశ్వర్లు, వరుణ్, వీరేష్, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



వాల్మీకి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే విరూపాక్షి, ఎమ్మెల్సీ మధుసూదన్

తెల్లబంగారం చిన్నబోతోంది!

కర్నూలు(అగ్రికల్చర్): పత్తి ధరలు తగ్గుతుండటంతో రైతులు తీవ్ర ఆందోళనకు లోనవుతున్నారు. పత్తికి మద్దతు ధర రూ.8,110 ఉంది. మార్కెట్‌లో మాత్రం క్వింటాకు లభిస్తున్న ధర రూ.7వేల వరకు మాత్రమే. సోమవారం ఆదోని మార్కెట్‌కు 11,623 క్వింటాళ్ల పత్తి విక్రయానికి రాగా.. కనిష్ట ధర రూ.3,960, మధ్య ధర రూ.7,450.. గరిష్ట ధర రూ.7,769 నమోదైంది. పత్తి క్రయవిక్రయాలు ఆదోని వ్యవసాయ మార్కెట్ యార్డులో మాత్రమే జరుగుతున్నాయి. ప్రస్తుతం ఆదోని మార్కెట్‌కు దాదాపు 12 వేల క్వింటాళ్ల పత్తి వస్తోంది. మార్కెట్‌లోకి పత్తి వస్తుందంటేనే ప్రభుత్వం సీసీఐని రంగంలోకి దించాలి. మామూలుగా అయితే సెప్టెంబర్ 15వ తేదీ నాటికే సీసీఐ కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాల్సి ఉన్నా ఇప్పటి వరకు అతీగతీ లేని పరిస్థితి. అధిక వర్షాల వల్ల గతంలో ఎప్పుడూ లేని విధంగా పత్తి దెబ్బతినింది. సగటు దిగుబడిలో సగం కూడా వచ్చే పరిస్థితి లేదు. అంతంతమాత్రం వచ్చిన దిగుబడులకు ధరలు లేవు. వెంటనే సీసీఐ ద్వారా కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని జిల్లా యంత్రాంగం నెల రోజుల క్రితమే ప్రభుత్వానికి నివేదించినా చలనం లేకపోవడం గమనార్హం.

దివ్యాంగులకు మరోసారి 'పరీక్ష'

- నేటి నుంచి కర్నూలు, ఆదోని, ఎమ్మిగనూరు ఆసుపత్రుల్లో క్యాంపులు

కర్నూలు(అగ్రికల్చర్): దివ్యాంగులు మరోసారి సదరం క్యాంపు మెట్లు ఎక్కాల్సిన పరిస్థితి ఏర్పడింది. దివ్యాంగుల పింఛను పొందుతూ రీ వెరిఫికేషన్‌లో అనర్హత వేటు పడిన వారిలో అప్పీల్ చేసుకున్న వారికి మరోసారి పునః పరిశీలన చేపట్టనున్నారు. కర్నూలు జిల్లాలో 4731 దివ్యాంగుల పింఛన్లు, 17 హెల్త్ పింఛన్‌లు.. నంద్యాల జిల్లాలో 4,099 దివ్యాంగులు, 64 హెల్త్ పింఛన్లపై అనర్హత వేటు పడింది. ముందుగా నిర్ణయించిన ప్రకారం సెప్టెంబర్ నెలలోనే తొలగింపులు జరగాల్సి ఉంది. అయితే దివ్యాంగులఆందోళనలతో ప్రభుత్వం వెనక్కి తగ్గింది. సెప్టెంబర్, అక్టోబర్ నెలల్లో యథావిధిగా పింఛన్లు పంపిణీ చేసింది. అనర్హత ఉన్నట్లు నోటీసులు అందుకున్న కర్నూలు జిల్లాలో 4,286 మంది, నంద్యాల జిల్లాలో 4వేల మందికిపైగా దివ్యాంగులు అప్పీల్ చేసుకున్నారు. వీరందరికీ మరోసారి వికలత్వం పరిశీలించే కార్యక్రమం ఈ నెల 8వ తేదీ నుంచి మొదలు కానుంది. ఇందు కోసం కర్నూలు సర్వజన వైద్యశాల, ఎమ్మిగనూరు, ఆదోని ప్రభుత్వ వైద్యశాలల్లో సదరం క్యాంపులు ఏర్పాటు చేశారు. ప్రతి వారం బుధ, గురు, శుక్రవారాల్లో ఈ క్యాంపులు నిర్వహిస్తారు. కర్నూలు సర్వజన వైద్యశాలలో చెవి, కన్ను, ఆర్థోపెడిక్, మానసిక వైకల్యం కలిగిన వారికి పరీక్షలు నిర్వహిస్తారు. ఎమ్మిగనూరులో కేవలం ఆర్థోపెడిక్, ఆదోనిలో ఆర్థోపెడిక్, కన్నుకు సంబంధించి సదరం పరీక్షలు నిర్వహించనున్నారు.

స్కూల్ బ్యాగులు చిరిగి.. నాణ్యత నవ్వి!

- జిల్లాలో 2.68 లక్షల మందికి స్కూల్ బ్యాగుల పంపిణీ
- చిరిగిన బ్యాగ్‌లు వెనక్కి ఇస్తే కొత్తవి ఇస్తామని ప్రకటన
- కుట్లు పోయింటే కుట్టించుకుని వాడుకోవాలంటున్న అధికారులు





ఓ స్కూల్‌లో మార్చేందుకు సేకరించిన చిరిగిన బ్యాగ్‌లు

కర్నూలు సిటీ: 'సర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థిమిత్ర' బ్యాగుల పరిస్థితి జిల్లాలో దారుణంగా ఉంది. చిరిగిపోయిన బ్యాగులు గుట్టలుగా పడి ఉన్నాయి. ఈ విద్యాసంవత్సరం ప్రారంభానికి ముందు స్కూల్ బ్యాగులను అత్యంత నాణ్యత కలిగినవి అందిస్తున్నామని రాష్ట్ర మానవ వనరుల శాఖ మంత్రి నారా లోకేష్ ప్రకటన చేశారు. అయితే విద్యా సంవత్సరం మొదలయ్యాక కొంత ఆలస్యంగా విద్యార్థులకు బ్యాగులను అందించారు. నెల రోజుల్లోపే వాటిలో 60 శాతంపైనే చిరిగిపోయాయి. విద్యార్థులు అవస్థలు పడుతుండటంతో విద్యాశాఖ ఉన్నతాధికారులు దిద్దుబాటు చర్యలు చేపట్టారు. చిరిగిన, కుట్లు పోయిన వాటిని రిటర్న్ పంపించాలని, వాటి స్థానంలో కొత్తవి ఇస్తామని ఇటీవలే ఆయా స్కూళ్ల హెచ్‌ఎంలకు ఆదేశాలు ఇచ్చారు. దీంతో చాలా మంది హెచ్‌ఎంలు యాప్‌లో బ్యాగ్‌లను రిటర్న్ చేసేందుకు వివరాలు నమోదు చేశారు. అయితే ఇందులో బ్యాగ్ మొత్తం పనికిరాకుండా ఉంటేనే వెనక్కి తీసుకుని కొత్తది ఇస్తామని విద్యాశాఖ అధికారులు మెలిక పెట్టారు.

చిరిగితే కుట్టించుకోండి!

జిల్లాలోని 1,457 ప్రభుత్వ యాజమాన్య స్కూళ్లు ఉండగా 2,76,971 మంది విద్యార్థులు చదువుతున్నారు. వీరికి సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర కిట్లు 2.68 లక్షలు అందజేశారు. ఒక్కో కిట్టు విలువ రూ.2,279 కాగా వీటిలో స్కూల్ బ్యాగు ఉంది. చిరిగిపోయిన స్కూల్ బ్యాగ్ రిటర్న్ ఇవ్వాలని విద్యాశాఖ ఇచ్చిన ఆదేశాల మేరకు జిల్లాలో రెండు రోజులకే 1,174 మంది పిల్లలు రిటర్న్ చేసేందుకు యాప్‌లో అప్‌లోడ్ చేశారు. అయితే 252 మందికి మాత్రమే కొత్త బ్యాగ్‌లు ఇవ్వనున్నారు. మిగిలిన బ్యాగ్‌లను ఆయా స్కూళ్లకు వెనక్కి పంపించి కుట్లు పోయింటే, చిరిగిపోయింటే కుట్లు వేయించుకోండి అని విద్యాశాఖ అధికారులు చెబుతున్నట్లు సమాచారం.

కొలతలు లేకుండానే బూట్లు..



బాక్స్‌ల్లో బూట్లు

డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర కిట్లలో 2,71,006 మంది విద్యార్థులకు బూట్లు, ఒక్కో విద్యార్థికి రెండు జతల సాక్సులు ఇవ్వాలి. కానీ ఇప్పటి వరకు పూర్తి స్థాయిలో విద్యార్థులకు అందజేయలేదు. కొందరికి ఇచ్చినా ఎలాంటి ముందస్తు కొలతలు తీయకుండానే విద్యార్థులకు అందజేశారు. దీంతో చాలా మంది విద్యార్థులు బూట్లు వేసుకోకుండానే చెప్పులు వేసుకోని స్కూళ్లకు వస్తున్నారు. చిప్పగిరి, కృష్ణగిరి, వెల్దుర్తి, ఎమ్మిగనూరు మండలాల్లో సుమారుగా 500 మంది విద్యార్థులకు ఇంత వరకు స్కూల్ బ్యాగ్‌లు ఇవ్వలేదని ఉపాధ్యాయ వర్గాలే చెబుతున్నాయి. ఆయా మండలాల పరిధిలోని స్కూళ్ల నుంచి చిరిగిన బ్యాగ్‌లు, కుట్లుపోయిన బ్యాగ్‌లను సేకరించి జిల్లా కేంద్రం సమీపంలోని పెద్దపాడు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటు చేసిన స్టోరేజీ పాయింట్‌కు చేర్చాలని సమగ్ర శిక్ష అధికారులు ఎంఈఓలకు ఆదేశాలు ఇచ్చారు. జిల్లాలో 26 మండలాలు ఉంటే కేవలం నాలుగు మండలాల నుంచి మాత్రమే బ్యాగ్‌లు మార్పులు చేసేందుకు యాప్‌లో అప్‌లోడ్ చేసినట్లు తెలుస్తుంది. ఈ నాలుగు మండలాల్లో కూడా కొన్ని స్కూళ్ల నుంచి మాత్రమే కొత్త బ్యాగ్‌లు కోరినట్లు తెలుస్తోంది.

నాణ్యమైన బ్యాగ్‌లు ఇచ్చేందుకు చర్యలు

డా.సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర కిట్లలో భాగంగా విద్యార్థులకు స్కూల్ బ్యాగ్‌లు, బూట్లు అందజేశాం. బ్యాగ్‌లో కొన్ని డ్యామేజ్ వచ్చినవి, చినిగిపోయి వినియోగించేందుకు ఉపయోగంగా లేని వాటిని మార్చి నాణ్యమైన బ్యాగ్‌లను అందజేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం. అదే విధంగా కొలతలు సరిపోని బూట్లను సైతం మార్పులు చేసి కొత్తవి ఇవ్వనున్నాం. – ఎస్.శ్యామూల్ పాల్, డీఈఓ

వైభవంగా పవిత్రోత్సవాలు



ప్రత్యేకాలంకరణలో శ్రీదేవి, భూదేవి సమేత ప్రహ్లాదవరదుడు

ఆళ్లగడ్డ: దిగువ అహోబిలం శ్రీ ప్రహ్లాదవరదస్వామి ఆలయంలో మూడురోజుల పాటు జరిగే వార్షిక పవిత్రోత్సవాలు మంగళవారం నుంచి అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. ఇందులో భాగంగా అహోబిలం మఠం పీఠాధిపతి శ్రీ రంగరాజ యతీంద్ర మహాదేశికన్ ఆధ్వర్యంలో మూలమూర్తులు శ్రీ ప్రహ్లాదవరదస్వామి, అమృతవల్లీ అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వేద పండితుల వేదమంత్రోచ్చారణలతో ఆస్థాన విద్వాంసుల మంగళవాయిద్యాల మధ్య పవిత్ర హోమాలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. రాత్రి ఉత్సవమూర్తులైన శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ ప్రహ్లాదవరదులకు గ్రామోత్సవం నిర్వహించారు.

క్లుప్తంగా

ట్రావెల్స్ బస్సుకు భారీ జరిమానా


బస్సు వద్ద అధికారులు

డోన్ టౌన్: రాష్ట్రానికి చెల్లించాల్సిన ట్యాక్స్ చెల్లించకుండా రాకపోకలు సాగిస్తున్న ప్రైవేట్ ట్రావెల్స్ బస్సుకు రూ.1.91 లక్షల జరిమానా విధించినట్లు డోన్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ క్రాంతికుమార్ మంగళవారం తెలిపారు. సోమవారం అర్ధరాత్రి కర్నూలు రోడ్డులోని అముకతాడు టోల్ ప్లాజా వద్ద రవాణా శాఖ అధికారులు వాహనాల తనిఖీ చేపట్టారు. ఆ సమయంలో మధ్యప్రదేశ్ రాష్ట్రానికి చెందిన శిఖర్వార్ అనే ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు ఆ రాష్ట్రం నుంచి బెంగుళూరుకు వెళుతుండగా అమకతాడు టోల్ గేట్ వద్ద ఆపి తనిఖీ చేయగా ఏపీ చెల్లించాల్సిన ట్యాక్స్ చెల్లించలేదని తెలిసింది. దీంతో వాహనంపై జరిమానా విధించినట్లు ఎంవీఐ తెలిపారు. తనిఖీల్లో నంద్యాల అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ నాగేంద్రరావు ఉన్నారు.

హడావుడిగా మండలాలకు శనగ విత్తనాలు

కర్నూలు(అగ్రికల్చర్): రబీ సీజన్ మొదలై వారం రోజులు గడచినప్పటికీ పప్పు శనగ విత్తన పంపిణీ అతీగతీ లేకపోయింది. మంగళవారం 'సాక్షి'లో శనగ విత్తు అందక రైతుకు బెంగ శీర్షికన కథనం ప్రచురితమవడంతో వ్యవసాయ శాఖలో కదలిక వచ్చింది. ముఖ్యమంత్రి వ్యవసాయ శాఖపై బుధవారం సమీక్ష నిర్వహిస్తున్న తరుణంలో హడివుడిగా వెల్దుర్తి, తుగ్గలి, ఆలూరు, బనగానపల్లి మండలాల్లో శనగ విత్తనాలను అరకొరగా అందుబాటులో ఉంచడం గమనార్హం. విత్తనాల కోసం రైతులు డి-క్రిషి యాప్‌లో పేర్లు రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. 'సాక్షి'లో కథనం వచ్చిన తర్వాత ఆగమేఘాల మీద యాప్ ఇచ్చారు. ఇంతవరకు ఒక్క రైతు కూడా పేరు రిజిస్ట్రేషన్ చేసుకొని విత్తనాలు పొందలేదంటే యాప్ అమలులోకి రాకపోవడమే కారణంగా తెలుస్తోంది. సబ్సిడీపై విత్తనాల పంపిణీకి ఎగనామం పెట్టే కుట్రలో భాగంగానే అధిక ధర నిర్ణయం, నామమాత్రపు సబ్సిడీ అనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

ఉద్యమాలతోనే మహిళా సమస్యలకు పరిష్కారం


మాట్లాడుతున్న పి.నిర్మల

కర్నూలు(సెంట్రల్): ఐక్య ఉద్యమాల ద్వారానే మహిళల సమస్యలకు పరిష్కారం లభిస్తుందని ఐద్వా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు పి.నిర్మల పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం మహిళల సమస్యల పరిష్కారంలో తీవ్ర నిర్లక్ష్యం వహిస్తున్న నేపథ్యంలో పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. మంగళవారం కార్మిక కర్షక భవన్‌లో ఐద్వా 12వ జిల్లా మహాసభలు నిర్వహించారు. ముందుగా ఆమె జెండాను ఆవిష్కరించారు. అనంతరం ప్రజానాట్య మండలి కళాకారులు మహిళల ఔన్నత్యాన్ని కళారూపంలో వివరించారు. అనంతరం జరిగిన సభకు అరుణమ్మ, ధనలక్ష్మీ అధ్యక్షత వహించగా ముఖ్యఅతిథిగా హాజరైన పి.నిర్మల మాట్లాడారు.. రాష్ట్రంలో సీఎం చంద్రబాబు మద్యాన్ని ఏరులై పారిస్తున్నారన్నారు. నకిలీ మద్యాన్ని తయారు చేసి ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారని మండిపడ్డారు. ఎన్నికల సమయంలో మహిళలకు ఇచ్చిన ఒక్క హామీని కూడా నెరవేర్చలేదన్నారు. మహిళలపై దౌర్జన్యాలు, దాడులు, హత్యలు, మానభంగాలు ఎక్కువయ్యాయని, వాటిని అరికట్టడంలో ప్రభుత్వం ఘోరంగా విఫలమైందన్నారు. ఈ నెల 13, 14, 15 తేదీల్లో అనంతపురంలో జరిగే రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రత్నమ్మ, ఉమాదేవి, సుజాత పాల్గొన్నారు.


జొహరాపురంలో ఉల్లి పంటను ట్రాక్టర్‌తో తొలగిస్తున్న రైతన్న

ఉల్లి.. రైతు తల్లడిల్లి!

కూటమి పాలనలో రైతుల పరిస్థితి దయనీయంగా మారింది. దాదాపు అన్ని పంటలకు గిట్టుబాటు ధర లేక రైతన్నలు తల్లడిల్లుతున్నారు. ఉల్లి రైతుల పరిస్థితి మరింత దారుణంగా ఉంది. పండించిన ఉల్లిని మార్కెట్‌కు తీసుకెళ్తే పెట్టుబడి ఖర్చులు దేవుడెరుగు కనీసం కూలీలు, రవాణా ఖర్చులు కూడా రావడం లేదు. ప్రభుత్వం మొదట ఉల్లి క్వింటాలుకు రూ.1200 ధర కల్పిస్తామని చెప్పడం తర్వాత ఎకరానికి రూ.20 వేలు ఇస్తామంటూ రోజుకో మాట చెబుతుండటంతో నమ్మకం లేక రైతన్నలు తీవ్ర ఆవేదనతో చేతికొచ్చిన పంటను దున్నేస్తున్నారు. ఈ క్రమంలో ఆస్పరి మండలం జొహరాపురం గ్రామానికి చెందిన జేపీ రంగస్వామి అనే రైతు ఆరెకరాల్లో ఉల్లి పంటను ట్రాక్టర్‌తో మంగళవారం తొలగించాడు. పంట సాగు కోసం రూ.3 లక్షల పెట్టుబడి పెట్టాడు. మార్కెట్లో ఉల్లికి ధర లేకపోవడం, కోతలకు అయ్యే ఖర్చులు కూడా రాని పరిస్థితి ఉండటంతో తీవ్ర ఆవేదనకు గురై చేతికొచ్చిన పంటను ట్రాక్టర్‌తో దున్నేశాడు. అంతకుముందు పంటను గొర్రెలకు వదిలేశాడు. ఇదిలాఉండగా జొహరాపురంలో 15 మంది రైతులు దాదాపు 100 ఎకరాల్లో నల్లరేగడి మెట్ట పొలంలో ఉల్లిని సాగు చేశారు. వారు కూడా చేసేది లేక ఉల్లి పంటను తొలగించారు.

– ఆస్పరి

బాధ దిగమింగి.. జీవాలకు మేతగా..


జీవాలకు మేతగా వదిలేసిన ఉల్లి పంట


ఉల్లిగడ్డలను చూపుతున్న రైతు వీరేష్

ఉల్లిని కూలీలతో తెంపి మార్కెట్‌కు తీసుకెళ్లి విక్రయిస్తే సొమ్ము చేతికి రావాల్సింది పోయి.. మరింత అప్పుల ఊబిలో కూరుకుపోవాల్సిన దుస్థితి. దీంతో దిక్కుతోచక రైతులను పంటను జీవాలకు మేతగా వదిలేస్తున్నారు.

ఆలూరు మండలం మనేకుర్తికి చెందిన చాకలి పరమేష్ బోరు బావి కింద రెండెకరాల్లో ఉల్లి సాగు చేశారు. పెట్టుబడుల కోసం రూ.2 లక్షలు అప్పు చేశారు. పంట చేతికొచ్చిన దశలో ఉల్లికి ధర లేకుండా పోయింది. ఆదుకోవాల్సిన ప్రభుత్వం చేతులెత్తేసింది. మార్కెట్‌లో ఉల్లి ధర.. పంట కోతకు కూలీల ఖర్చు, రవాణా ఖర్చును బేరీజు వేసుకోగా మరింతగా అప్పుల భారం మీద పడుతుందని లెక్కలు వేసుకున్నారు. బాధను దిగమింగుకుని మంగళవారం ఉల్లి పంటను జీవాలకు మేతగా వదిలేశారు. దీనిపై బాధిత రైతును పలకరించగా.. ప్రభుత్వం ఉల్లి పంట హెక్టారుకు రూ.50 వేలు సాయం ప్రకటించింది. అది వచ్చే వరకు పొలంలో పంటను అలాగే ఉంచుకోలేం. అంతకుముందు ఉల్లి క్వింటాలుకు ప్రకటించిన రూ.1,200 మద్దతు ధర కూలీలకు కూడా సరిపోదు. కష్టనష్టాలకోర్చి ఆరుగాలం శ్రమించి పంటలను సాగు చేసిన రైతులకు చివరకు ఆత్మహత్యలే శరణ్యం తప్పా.. మిగిలేది ఏమీ లేదని కన్నీటి పర్యంతమయ్యారు.

– ఆలూరు

కోసిగిలో భారీ చోరీ

- 6 తులాల బంగారం, కేజీ వెండి అపహరణ


బీరువా తలుపులు తెరిచి చోరీ చేసిన దృశ్యం

కోసిగి: మండల కేంద్రంలోని సాయిబాబా గుడి సమీపంలో అర్ధరాత్రి ఓ ఇంట్లో భారీ చోరీ జరిగింది. బాధితులు తెలిపిన మేరకు వివరాలు.. స్థానిక ఉరుకుంద మెయిన్ రోడ్డులో మధు, లీలావతి దంపతులు నివాసం ఉంటున్నారు. సోమవారం కౌతాళంలో బంధువు చనిపోగా మధు అంత్యక్రియలకు వెళ్లాడు. రాత్రి వేళ ఇంట్లో ఒంటరిగా ఉండలేక లీలావతి గ్రామంలోనే ఉంటున్న అమ్మ వద్దకు వెళ్లింది. ఇదే అదునుగా భావించిన దుండగులు అర్ధరాత్రి ఇంటి తాళాలు పగులగొట్టి లోనికి చొరబడి బీరువాలోని సొమ్మును దోచుకెళ్లారు. ఉదయం దంపతులు ఇంటికి వచ్చి చూసేసరికి తాళాలు పగులగొట్టి ఉన్నాయి. బీరువాలో ఉంచిన 6 తులాల బంగారు నగలు, కేజీ వెండి, రూ.లక్ష నగదును దుండగులు దోచుకెళ్లినట్లు బాధితులు కన్నీరుమున్నీరయ్యారు. బయటి వ్యక్తులకు చెందిన బంగారు తాకట్టు పెట్టుకుని డబ్బు వడ్డీకి ఇచ్చినట్లు దంపతులు తెలిపారు. ఘటనపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా క్లూస్ బృందం వచ్చి వేలిముద్రలు సేకరించారు. ఆ ప్రాంతంలోని సీజీ పుటేజీ పరిశీలించగా ఇద్దరు దుండగులు ముఖానికి గుడ్డ కట్టుకొని చోరీకి పాల్పడినట్లు తెలిసింది. వరుస చోరీల నేపథ్యంలో పోలీసులు రాత్రి వేళ గస్తీ నిర్వహించాలని స్థానికులు కోరుతున్నారు.

ట్రావెల్స్ బస్సు బోల్తా


బోల్తా పడిన బస్సు

ఎమ్మిగనూరురూరల్: మండల పరిధిలోని సిరాలదొడ్డి సబ్‌స్టేషన్ సమీపంలో మంగళవారం తెల్లవారుజామున హైదరాబాద్ నుంచి ఆదోనికి వెళ్తున్న ఓ ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు అదుపుతప్పి బోల్తాపడింది. బస్సులోని ప్రయాణికులు భయంతో కేకలు వేశారు. బస్సులో 15 మంది ప్రయాణికులు ఉన్నట్లు తెలుస్తోంది. అందరూ స్వల్ప గాయాలతో బయట పడటంతో ప్రభుత్వాసుపత్రికి వెళ్లకుండా తెల్లవారుజామునే ఎవరికి వారు ఇతర వాహనాలలో ఆదోనికి వెళ్లిపోయినట్లు రూరల్ పోలీసులు తెలిపారు. డ్రైవర్ అజాగ్రత్త వల్లనే ప్రమాదం జరిగినట్లు ప్రయాణికులు చెబుతున్నారని పోలీసులు చెప్పారు.

పంటకోతకు ముందే కన్నీరు

- ఉల్లికి గిట్టుబాటు ధర లేక దున్నేయడం, గొర్రెలకు మేతగా వదిలేస్తున్న వైనం
- పది రోజుల్లో వందలాది ఎకరాల్లో పంటను ధ్వంసం చేసిన రైతులు


ఉల్లి పంటను రోటావేటర్‌తో ధ్వంసం చేస్తున్న రైతు


ధ్వంసమైన ఉల్లి

కోడుమూరు రూరల్: ఆరుగాలం కష్టించి పండించిన ఉల్లి పంటకు కూటమి ప్రభుత్వం గిట్టుబాటు ధరను కల్పించలేకపోతుంది. ధర లేక చేతికొచ్చిన ఉల్లి పంటను కొందరు దున్నేస్తుండగా, మరికొందరు రైతులు గొర్రెలకు మేతగా వదిలేస్తున్నారు. దీంతో కష్టపడి పండించిన పంట కళ్లెదుటే నాశనమవుతున్న దృశ్యాలను చూస్తూ రైతుల గుండెలు బరువెక్కుతున్నాయి. గతంలో ఏనాడు కూడా ఇలా చేతికొచ్చిన పంటలను చేజేతులా నాశనం చేసే దృశ్యాలను చూడలేదనిని రైతులు కన్నీటి పర్యంతమవుతున్నారు. ఈ దృశ్యాలు ప్రతి గ్రామంలో నిత్యం చోటుచేసుకుంటున్నాయి.

కర్నూలు జిల్లాలో ఈ ఏడాది 30 వేలకు పైగా ఎకరాల్లో రైతులు వర్షాధారం, బోరుబావుల కింద లక్షలాది రూపాయలు పెట్టుబడులు పెట్టి ఉల్లి పంటను సాగు చేశారు. రైతుల కష్టం ఫలించి దిగుబడులు బాగానే ఉన్నా మార్కెట్లో మాత్రం ధర పూర్తిగా పడిపోవడంతో పాటు, ఉల్లి అంటే మాకొద్దు అనే పరిస్థితి నెలకొంది. మార్కెట్లో క్వింటాల్ ఉల్లి రూ.500 కూడా పలకకపోవడంతో పంట కోసి మార్కెట్‌కు తరలించినా కూలీ రేట్లు కూడా రైతులకు గిట్టుబాటుగాని పరిస్థితి నెలకొంది. దీంతో గత 10 రోజుల వ్యవధిలో జిల్లాలోని కోడుమూరు, గూడూరు, సి.బెళగల్, క్రిష్ణగిరి, దేవనకొండ, గోనెగండ్ల, ఎమ్మిగనూరు, మంత్రాలయం, ఆస్పరి, తుగ్గలి, పత్తికొండ, ఆదోని, ఆలూరు వంటి ప్రాంతాల్లో వందలాది ఎకరాల్లో రైతులు చేతికొచ్చిన ఉల్లి పంటను దున్నేస్తూ గొర్రెలకు మేతగా వదిలేస్తూ ధ్వంసం చేశారు. ఒక్క కోడుమూరు మండలం ప్యాలకుర్తి గ్రామంలోనే గత వారం రోజుల్లో వెంకటప్ప, రఫీక్, శ్రీనివాసులు, షఫీ, తెలుగు శ్రీనివాసులు, గోపాల్, భాస్కర్‌రెడ్డిలతో పాటు మరికొందరు రైతులు 40కు పైగా ఎకరాల్లో సాగు చేసిన ఉల్లి పంటను ధ్వంసం చేశారంటే పరిస్థితి ఏ విధంగా ఉందో అర్థమవుతోంది.

ఉల్లి రైతులను పట్టించుకోని ప్రభుత్వం

ఆరంభ శూరత్వంగా కొద్ది రోజుల పాటు ఉల్లికి మద్దతు ధర అంటూ క్వింటాలు ఉల్లి రూ.1200 ప్రకారం కోనుగోలు చేసిన కూటమి ప్రభుత్వం ఆ తర్వాత పూర్తిగా చేతులెత్తేసింది. తర్వాత ఉల్లికి మద్దతు ధర గాకుండా హెక్టార్‌కు రూ.50 వేల ప్రకారం నష్టపరిహారం చెల్లిస్తామంటూ ప్రకటన చేసి చేతులు దులుపుకుంది.


ప్యాలకుర్తిలో గొర్రెలకు మేతగా వదిలేసిన ఉల్లి పంట

భారీగా నష్టపోయా..



ప్యాలకుర్తిలో ఎకరా రూ.20 వేల ప్రకారం కౌలుకు తీసుకొని రెండెకరాల్లో రూ.లక్షన్నర పెట్టుబడి పెట్టి ఉల్లి పంట సాగు చేశా. పంట చేతికొచ్చినప్పటి నుంచి మార్కెట్లో ధర లేకుండా పోయింది. కనీసం ఉల్లి గడ్డలు కోసి మార్కెట్‌కు తరలించినా కూలీలకు కూడా గిట్టుబాటు కాని పరిస్థితి. దీంతో రెండెకరాల్లోని ఉల్లి పంటను పూర్తిగా రోటావేటర్‌తో ధ్వంసం చేశా. ఉల్లి సాగుతో భారీగా నష్టపోయా. ఏమి చేయాలో పాలుపోవడం లేదు.

– రైతు గోపాల్, ముదుమలగుర్తి గ్రామం

రెండున్నరెకరాలు గొర్రెలకు వదిలేశా..



రెండున్నర ఎకరాల్లో బోరు కింద రూ.2 లక్షలు పెట్టుబడి పెట్టి ఉల్లి పంట సాగు చేశా. ఉల్లి దిగుబడి బాగున్నా మార్కెట్లో కొనే నాథుడే లేడు. చేసేది లేక పంటనంతా గత రెండు రోజుల నుంచి గొర్రెలకు వదలేశా. రైతులను ఆదుకోవాల్సిన ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. కనీసం ఉల్లి రైతులకు ప్రకటించిన నష్టపరిహారంమైన త్వరగా అందిస్తే ఇతర పంటలు సాగు చేసుకుంటాం.

– రైతు విజయభాస్కర్‌రెడ్డి, ప్యాలకుర్తి గ్రామం

స్మార్ట్ దోపిడీ!

- కొత్త రేషన్ కార్డులకు రూ.50 వసూలు చేస్తున్న డీలర్లు
- పట్టించుకోని అధికారులు

నందవరం: కూటమి ప్రభుత్వం ప్రజలకు స్మార్ట్ రేషన్ కార్డులు అందించాలనే ఉద్దేశంతో డిజిటల్ కార్డులను పంపిణీ చేసింది. దీంతో డీలర్లు స్మార్ట్ దందాకు తెరతీశారు. డిజిటల్ కార్డుకు రూ.50 చొప్పున అక్రమంగా వసూలు చేస్తున్నారు. నందవరం మండలానికి 18,946 స్మార్ట్ కార్డులు వచ్చాయి. అందులో 11,933 కార్డులను లబ్దిదారులకు పంపిణీ చేశారు. ముఖ్యంగా కనకవీడు గ్రామంలో 1,640 డిజిటల్ కార్డులు ఉన్నాయి. డీలర్లు ఒక్కో కార్డుకు రూ.50 చొప్పున వసూలు చేస్తుండటంతో లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వం ఉచితంగా పంపిణీ చేయాల్సిన స్మార్ట్ కార్డులకు టీడీపీ నాయకులు, డీలర్లు రూ.50 వసూలు చేయడమేమిటని విమర్శిస్తున్నారు. దీనిపై అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని, పేదలకు స్మార్ట్ రేషన్ కార్డులను ఉచితంగా పంపిణీ చేయాలని కోరుతున్నారు. ఈ విషయంపై ఆర్‌ఐ రవీంద్రరెడ్డిని వివరణ కోరగా.. వసూళ్లపై తమ దృష్టికి రాలేదని, ఎవరైనా ఫిర్యాదు చేస్తే తగిన చర్యలు తీసుంటామని చెప్పారు.

కల్వర్టు వద్ద ఇరుక్కుపోయిన లారీ

- స్తంభించిన రాకపోకలు


లారీని తొలగించి జేసీబీతో రోడ్డుకు మరమ్మతులు చేస్తున్న దృశ్యం

కోవెలకుంట్ల: కోవెలకుంట్ల– జమ్మలమడుగు ఆర్ అండ్‌బీ రహదారిలో మంగళవారం అర్ధరాత్రి కల్వర్టు వద్ద ఫ్లయాష్ లారీ ఇరుక్కుపోయింది. నంద్యాల నుంచి వైఎస్సార్ జిల్లా జమ్మలమడుగు వరకు జాతీయ రహదారి నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. మండలంలోని గుళ్లదూర్తి సమీపంలో కల్వర్టు విస్తరణ పనుల్లో భాగంగా రోడ్డును పక్కకు మళ్లించారు. అరకొరగా గ్రావెల్ వేసి తాత్కాలికంగా రోడ్డును ఏర్పాటు చేయడంతో ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్డు దెబ్బతింది. ఈ స్థితిలో మంగళవారం జమ్మలమడుగు నుంచి కోవెలకుంట్లకు వస్తున్న ఫ్లయాష్ ట్యాంకర్ లారీ గ్రావెల్ రోడ్డులో ఇరుక్కుపోయింది. ఈ రహదారిలో ప్రత్యామ్నాయం లేకపోవడంతో రెండు వైపులా వాహనాలు నిలిచి రాకపోకలు స్తంభించాయి. దీంతో కర్నూలు, నంద్యాల, జమ్మలమడుగు, ప్రొద్దుటూరు, కడప, తిరుపతి, తదితర ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులు అవస్థలు పడ్డారు. కొన్ని వాహనాలను గుళ్లదూర్తి నుంచి సంజామల మీదుగా కోవెలకుంట్ల వైపు మళ్లించారు. ఉదయం 10 గంటలకు జేసీబీ సాయంతో లారీని తొలగించడంతో రాకపోకలు యథావిధిగా సాగాయి.

బైకుల దొంగ అరెస్ట్

- రూ.2.97 లక్షలు విలువ చేసే ఆరు బైకులు స్వాధీనం

ఆదోని అర్బన్: మంత్రాలయం మండలం చౌటపల్లి గ్రామానికి చెందిన వీరేష్ అనే నిందితుడిని మంగళవారం పట్టణ శివారులోని ఆస్పరి రోడ్డులో టూటౌన్ పోలీసులు అరెస్టు చేసినట్లు సీఐ రాజశేఖర్‌రెడ్డి తెలిపారు. గత నెల 5వ తేదీన పట్టణంలోని భీమాస్ సర్కిల్‌లో చాంద్‌బాషా అనే వ్యక్తికి చెందిన బైకు చోరీ కావడంతో పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసులు సాంకేతిక పరిజ్ఞానంతో విచారణ జరిపి ఆస్పరి రోడ్డులో ఉన్న వీరేష్‌ను అరెస్టు చేసి, రూ.2.97 లక్షలు విలువ చేసే ఆరు బైకులను స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు.

రైతు సమస్యలపై చిత్తశుద్ధి లేని ప్రభుత్వం


మాట్లాడుతున్న పత్తికొండ మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి

పత్తికొండ: అన్నదాతలు ఎదుర్కొంటున్న సమస్యలపై కూటమి ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని పత్తికొండ మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కంగాటి శ్రీదేవి విమర్శించారు. మంగళవారం పత్తికొండ వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరులతో సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. వైఎస్సార్‌సీపీ అధికారంలోనే హోసూరు రహదారిలో టమాట ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటుకు శ్రీకారం చుట్టామన్నారు. అనంతరం అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం రాజకీయ కారణాలతో మరో చోటుకు మార్చడంతో పాటు ఆరు నెలల్లో పూర్తి చేశామని ప్రారంభ సమయంలో రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ ప్రగల్భాలు పలికారన్నారు. ఇంకా ఇప్పటికీ పనులు పునాదులు దశలోనే ఉన్నాయన్నారు. గత ప్రభుత్వంలో పత్తికొండ పట్టణంలో రోడ్డు విస్తరణ పనులు రూ. 30 కోట్లతో ప్రారంభిస్తే టీడీపీ లీగల్ సెల్ నాయకుడు కోర్టుకు వెళ్లి అడ్డుకున్నారన్నారు. ఇప్పటికైనా కూటమి నాయకులు రోడ్డు పనులు ప్రారంభించి ప్రజలకు మేలు చేయాలని హితవు పలికారు. రాష్ట్రవ్యాప్తంగా విచ్చలవిడిగా గ్రామాల్లో బెల్ట్‌షాపుల్లో నకిలీ మద్యం విక్రయాలు జరుగుతున్నాయని, ప్రజలు జాగ్రత్తగా ఉండాలని సూచించారు.

ఉల్లి, టమాట రైతులు భారీగా నష్టపోతున్నా ప్రభుత్వంలో కనీస స్పందన లేకపోవడం దారుణమన్నారు. రైతులు దిగుబడిని పొలంలోనే పశువులకు మేతగా వదిలేస్తున్నారని, ఇలాంటి పరిస్థితిని కూడా పార్టీలకు ఆపాదించడం వారి కూటమి నేతల అవివేకమన్నారు. ఉల్లి, టమాట పంటలను వైఎస్సార్‌సీపీకు చెందిన రైతులు మాత్రమే సాగు చేయలేదనే విషయాన్ని గుర్తించాలన్నారు. వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు తలా.. తోక లేకుండా మాట్లాడుతున్నారని విమర్శించారు. గిట్టుబాటు ధర కల్పించ డం చేతగాక టమాట నాణ్యతపై మాట్లాడటం మంత్రి స్థాయిలో తగదన్నారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర మేధావుల ఫోరం అధికార ప్రతినిధి శ్రీరంగడు, బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి సోమశేఖర్, ఎంపీపీ నారాయణ్‌దాస్, ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు భాస్కర్‌నాయక్, మండల కన్వీనర్ కారం నాగరాజు, సీనియర్ నాయకులు టీఎమ్‌డీ హుసేన్, జిట్టా నాగేష్, భాస్కర్‌రెడ్డి, కోతిరాళ్ల అంజినయ్య, పులికొండ తిప్పన్న, కారుమంచి నజీర్, సాబ్దిన్ నూర్‌బాషా, అట్లా గోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సబ్‌రిజిస్ట్రార్‌తో అనుచిత ప్రవర్తన

సాక్షి టాస్క్‌ఫోర్స్: అవుకు పట్టణంలో సబ్‌రిజిస్ట్రార్ పట్ల కొంత మంది యూట్యూబర్లు మంగళవారం అనుచితంగా ప్రవర్తించారు. వివిధ గ్రామాలకు చెందిన రైతులు రిజిస్ట్రేషన్ కోసం వచ్చిన సమయంలో విధుల్లో నిమగ్నమై ఉన్న మహిళా సబ్‌రిజిస్ట్రార్ నీలమ్మ పట్ల ఇష్టానుసారంగా వ్యవహరించారు. ఏడెనిమిది మంది యూట్యూబర్లు ఆమెతో అమర్యాదగా వ్యవహరించినట్లు తెలుస్తోంది. వారి ప్రవర్తనతో సబ్‌రిజిస్ట్రార్ కుంగిపోయారు. వారిపై అవుకు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు రంగప్రవేశం చేసి నలుగురు యూట్యూబర్లను అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. మిగిలిన వారు ఎవరు అనే కోణంలో పోలీసులు ఆరా తీస్తున్నారు. ఇదిలాఉండగా రెండు రోజుల క్రితం రిజిస్ట్రార్ కార్యాలయానికి చేరుకొని తలుపులను కాళ్లతో కొట్టి హంగామా చేసినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఆ సమయంలో సబ్ రిజిస్ట్రార్ విధులు ముగించుకొని వెళ్లిపోయారు. తాజా ఘటనపై సబ్‌రిజిస్ట్రార్ ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టినట్లు అవుకు ఎస్‌ఐ రాజారెడ్డి తెలిపారు. నిందితులను అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేస్తున్నట్లు వెల్లడించారు.

వ్యక్తి ఆత్మహత్య

ఆళ్లగడ్డ: కాళ్ల నొప్పుల బాధ తాళలేక వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన పాలసాగరంలో చోటు చేసుకుంది. మున్సిపాలిటీ పరిధిలోని పాలసాగరం గ్రామానికి చెందిన చిన్న ఖాశీం (55) గత కొన్ని సంవత్సరాలుగా మోకాళ్ల నొప్పులతో బాధపడుతున్నాడు. నొప్పులు మరింత తీవ్రం కావడంతో ఆసుపత్రికి వెళ్లగా ఆపరేషన్ చేయాలని అందుకు సుమారు రూ.6 లక్షలు ఖర్చవుతుందని చెప్పారు. అంత డబ్బు పెట్టుకునే శక్తి లేకపోవడంతో నొప్పులు భరించలేక మంగళవారం రాత్రి ఆత్మహత్య చేసుకునేందుకు శనగల మాత్రలు మింగాడు. అపస్మారక స్థితిలో ఉన్న చిన్న ఖాశీంను కుటుంబ సభ్యులు ఆళ్లగడ్డ ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా వైద్యుల సూచన మేరకు నంద్యాలకు తరలిస్తుండగా మార్గం మధ్యలోనే మృతి చెందాడు. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని విచారణ చేస్తున్నట్లు ఎస్‌ఐ నగీన చెప్పారు.

నవంబర్ 12న ఆర్‌యూ కాన్వొకేషన్

- హాజరు కానున్న గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్


ఆర్‌యూ వీసీ ప్రొఫెసర్ వెంకట బసవరావు

కర్నూలు కల్చరల్: రాయలసీమ యూనివర్సిటీ (ఆర్‌యూ) 4వ కాన్వొకేషన్ నవంబర్ 12న వర్సిటీలో నిర్వహిస్తున్నట్లు వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ వి.వెంకటబసవరావు తెలిపారు. మంగళవారం ఆయన 'సాక్షి'తో మాట్లాడుతూ కాన్వొకేషన్‌కు గవర్నర్, వర్సిటీ చాన్సలర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ హాజరవుతారన్నారు. 2021–22, 2022–23, 2023–24, 2024–25 విద్యా సంవత్సరాల్లో వర్సిటీ పరిధిలో యూజీ, పీజీ, బీఈడీ, బీపీఈడీ, ఎల్‌ఎల్‌బీ, ఎంబీఏ, ఎంసీఏ కోర్సులు పూర్తి చేసుకొని ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు వారి విద్యార్హత పట్టాలను పొందవచ్చన్నారు. ఇప్పటికే రెండుసార్లు కాన్వొకేషన్‌కు నోటిఫికేషన్ విడుదల చేయడంతో విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారన్నారు. యూజీ విద్యార్థులు 9404, పీజీ, ఇతర ప్రొఫెషనల్ కోర్సుల విద్యార్థులు 420, పీహెచ్‌డీ 148 మంది దరఖాస్తు చేసుకున్న వారిలో ఉన్నారన్నారు. 70 మంది విద్యార్థులకు గోల్డ్‌మెడల్స్ ప్రదానం చేయనున్నట్లు తెలిపారు.


బండినాయిని పాలెం గ్రామ సమీపంలోని పొలాల్లో వికసించిన అగ్నిశిఖ మొక్క

అడవిలో అగ్నిశిఖ




ఎరుపు, పసుపు రంగులతో..

ఆయుర్వేద వైద్యంలో అడవి నాభిగా ప్రసిద్ధి చెందిన అగ్నిశిఖ మొక్కలు నల్లమలలోని కనువిందు చేస్తున్నాయి. కొత్తపల్లి సమీపంలోని నల్లమల అటవీ ప్రాంతం, గువ్వలకుంట్ల, పాలెంచెరువు, బండినాయిని పాలెం సమీపంలోని వరి పంట పొలాల్లో, ఆత్మకూరు మండలంలోని కొట్టాల చెరువు గ్రామ సమీపంలోని అటవీ ప్రాంతంలో మొక్కలు విరివిగా ఉన్నాయి. దీనినే నాగేటిగడ్డ, నీరుపిప్పిలి మొక్క అని పిలుస్తుంటారు. ఈ తీగ జాతి మొక్క పక్కనున్న మొక్కలను ఆధారం చేసుకుని పైకి ఎగబాకుతుంటాయి. ఈ పుష్పాలు ఎరుపు, నారింజ, తెలుపు, పసుపు రంగుల కలబోతగా దర్శనమిస్తాయి. ఈ పుష్పాలను ఆయుర్వేదంలో దివ్య ఔషధంగా భావిస్తారు. దీని కాండం, ఆకులు, విత్తనాలు, పండ్లు, పూలు, దుంపలన్నీ విషపూరితం. పాముకాటు, తేలు కాటుకు విరుగుడుగా, పలు రోగాల నివారణగా ఉపయోగపడుతుందని ఆయుర్వేద వైద్య నిపుణులు పేర్కొంటున్నారు. వైద్యుల సూచనలు, సలహాల మేరకు వాడుకోవాలని నిపుణులు చెబుతున్నారు.

– కొత్తపల్లి